
ఒక చిన్న
అబద్ధం..!
Midhuna's
RESTUARANT
అంగులూరి అంజనీదేవి

# ఒక చిన్న అబద్ధం...!

హైదరాబాదు రింగ్‌రోడ్డు మీద మంజీర్ నడుపుతున్న ఇన్నోవా కారు ఆగకుండా పరుగు పెడుతోంది. ఆ కారులో వెనక సీట్లో అత్యంత భద్రతా భావంతో కూర్చుని వుంది మిథున. ఆమె వయసు ఇరవై ఎనిమిది సంవత్సరాలు. ఉదయం 9 గంటలకి ఢిల్లీలో ఒక కాన్ఫరెన్స్‌కు హాజరై తిరిగి హైదరాబాద్ వచ్చింది. ఆమెను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పికప్ చేసుకొని కారులో ఇంటికి తీసికెళ్తున్నాడు మంజీర్.

మంజీర్ ఎవరంటే మిథున స్నేహితురాలు జాహ్నవి రిఫరెన్స్ మీద మిథున కారుకు కొత్తగా నియమించుకున్న డ్రైవర్. అతని వృత్తికి, అతని ఫిజిక్‌కి ఎలాంటి సంబంధం వుండదు. ఒక్కోసారి అతను నిలబడే తీరు, కూర్చునే విధానం, నడక, మాట చూస్తుంటే సాఫ్ట్‌వేర్ అబ్బాయిని చూస్తున్నట్లే వుంటుంది. అతన్ని డ్రైవర్‌గా పరిచయం చేస్తేనే తప్ప అతను మిథున దగ్గర డ్రైవర్‌గా పనిచేస్తున్నాడన్నది బయటి వ్యక్తులు తెలుసుకోలేరు. అతని వయసు ఇరవై తొమ్మిది. అతను కొంతకాలం అబ్రాడ్‌లో వుండి వచ్చాడు. అందుకే అతనికి

మిథున ఎప్పుడు ఎంత రెస్పెక్ట్ ఇవ్వాలో అంతకన్నా ఎక్కువగా ఇస్తుంది. ఫ్రెండ్లీగా వుంటుంది.

మిథునకు మంజీర్ డ్రైవింగ్ అంటే ఇష్టం. అందుకే ఆమె ఎక్కడికి వెళ్లాలన్నా, ఎక్కడి నుండి ఇంటికి రావాలన్నా అతనే కారు తీసుకొని వెళ్తుంటాడు. ఆమె కూడా మంజీర్‌తో 'మంజీర్! స్టీరింగ్ నీ చేతుల్లో వున్నంత సేపు నాకు నిశ్చింతగా వుంటుంది. ఇంట్లో కన్నా నేను కారులోనే ఎక్కువగా రిలాక్స్ అవుతాను' అని చాలాసార్లు చెప్పింది. ఆమె అభిప్రాయాన్ని భారతరత్నలా భావించాడు మంజీర్. అందుకేనేమో ఆమెపట్ల చాలా బాధ్యతగా వ్యవహరిస్తుంటాడు. ఇవాళ ఢిల్లీలో వాతావరణం సహకరించకపోవడం వల్ల మిథున ఎక్కబోయే ఫ్లైట్ ఒకటిన్నర గంట ఆలస్యంగా టేకాఫ్ అవుతుందని తెలిసినా మంజీర్ విసుక్కోలేదు. ఆమెకోసం ఎదురుచూస్తూ పాటలు వింటూ కారులోనే కూర్చున్నాడు. చాలామంది డ్రైవర్లు అలా వుండరు.

రింగ్‌రోడ్డు ఒన్‌వే కాబట్టి ఓవర్‌టేక్‌లు వుండవు. 60 నుండి 80 కిలోమీటర్ల మధ్య వేగంతో కారును చాలా స్మూత్‌గా నడుపుతున్నాడు మంజీర్. అతని డ్రైవింగ్‌ను ఆమె ఎంత ఇష్టపడుతుందో ఆ కారును కూడా అంతే ఇష్టపడుతుంది. ఆ కారును కొని ఇంటికి తెచ్చుకున్న రోజు అయితే ఆ రాత్రంతా కారునే చూస్తూ బాల్కనీలో కూర్చుంది. చిన్నపిల్ల నీళ్లను చూసి సంబరపడినట్లు మధ్యమధ్యలో నిద్రలేచి వెళ్లి కారును తాకి సంతోషపడేది. ఇల్లు కూడా అంతే! ఆమెకు ఎలాంటి ఏరియా అయితే బావుంటుందో అక్కడే కొనుక్కుంది. ఆ ఇంటిని గాని, ఆ కారును గాని ఎవరు చూసినా 'ఇలాంటివి మనక్కూడా వుంటే బావుండు కదా! మిథున ఎంత లక్కీనో' అనుకుంటారు. కారు, ఇల్లే కాదు ఆమె జీవనశైలి కూడా భిన్నంగానే వుంటుంది. అసలు ఆమె తన కెరీర్‌ను మలచుకున్న విధానమే ఒక సంచలనం.

మిథున ఎప్పుడూ లేనంత ఏకాగ్రతతో కారులోంచి బయటికి చూస్తోంది. బయట కన్పిస్తున్న దృశ్యాలన్నీ పాతవే అయినా కొత్తగా

చూడాలనుకుంటోంది. కొత్తగా ఆలోచించాలనుకుంటోంది. కానీ ఆ దృశ్యాలేవీ ఆమె కళ్లను తాకినంత సులభంగా మనసును చేరుకోవటం లేదు. అలా ఎందుకు జరుగుతుందో ఆమెకు తెలుసు.

చంద్రబింబంపై మబ్బులు అడ్డొచ్చినట్లు ఆమె ముంగురులు ఆమె ముఖాన్ని కప్పివేయడం వ్యూ మిర్రర్‌లోంచి మంజీర్‌కి కన్పిస్తోంది. ఆమె మంజీర్‌ని చూడటం లేదు. దీర్ఘాలోచనలో వుంది.

మంజీర్ ఆమె మీద నుండి తన చూపుల్ని వెంటనే రోడ్డుమీదకు మరల్చి "మీకోసం జాహ్నవి మేడమ్ కాల్ చేశారు మేడమ్! మీ ఫ్లైట్ లేటని చెప్పగానే రేపు కలుస్తానన్నారు" అన్నాడు.

అది వినగానే ఉలిక్కిపడింది మిథున "జాహ్నవి నీకు కాల్ చేసిందా?" అంది.

"అవును మేడమ్! మీకు కాల్ చేస్తే మీరు రెస్పాండ్ కాలేదట. అందుకే నాకు కాల్ చేశానన్నారు" అన్నాడు. అతను అవటానికి డ్రైవరే అయినా మిథునకు పర్సనల్ సెక్రటరీ లాంటివాడని జాహ్నవికి తెలుసు. అందుకే అతని నెంబర్‌ని ఆమె మొబైల్లో ఫీడ్ చేసుకుంది.

"ఓ.కె. మంజీర్! నేను జాహ్నవికి కాల్ చేస్తాను. ఆమె నాకు కాల్ చేసినప్పుడు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో నేను బిజీగా వున్నాను. అందుకే జాహ్నవి కాల్‌కి రెస్పాండ్ కాలేకపోయాను" అంటూ కారు సీటుకి మరింత వెనక్కి ఒరిగి రిలాక్స్‌గా కూర్చుంది.

మంజీర్ విన్నాడు కాని మాట్లాడలేదు. ఏకాగ్రతతో డ్రైవ్ చేస్తున్నాడు.

మిథున ఢిల్లీలో ఫ్లైట్ ఎక్కినప్పటినుండి తన మనసుతో యుద్ధం చేస్తోంది. పైకి కన్పించని మౌన సంఘర్షణ అది. 'నన్ను నీ గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్నావా?' అని ప్రశ్నించే మనసుకు సమాధానం చెప్పుకోలేకపోతోంది.

మంజీర్ మళ్ళీ వ్యూ మిర్రర్‌లోంచి మిథునను చూశాడు. కారు ఎక్కి అర్థగంట అయినా ఆమె మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా వుంది.

మృదు గంభీరంగా చూస్తున్న ఆమెను ఎలా కదిలించాలో అతనికి అర్థం కావడం లేదు.

"ఢిల్లీ ఎయిర్‌పోర్టులో బిజీగా వున్నాను అంటే నాకు తెలిసి మీరు ఖాళీ సమయంలో పుస్తకం చదువుతూ కూర్చుని వుంటారు. ఆ పుస్తకంలో చదవకూడని చదవరాని అంశాలనేమైనా చదివారా? మూడీగా వున్నారు? అసలేం జరిగింది మేడమ్?" అన్నాడు.

ఆమె తన సీట్లోంచి కదిలి మామూలుగా కూర్చుంది. ఎప్పుడైనా ఆమెలో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైయిర్యం, ఆత్మాభిమానం ఎక్కువ. ఏం జరిగినా చలించని తత్వం ఆమెది. ఎటుచూసినా విలక్షణమైన అందంతో, వయసుతో పాటు పెరుగుతున్న హుందాతనంతో వ్యక్తిత్వమే తన ఊపిరిగా మసులుకుంటుంది. అలాంటి ఆమె ఈరోజు ఎందుకింత చలించిపోతుందో ఆమెకే ఆశ్చర్యంగా వుంది. మంజీర్‌కి వెంటనే సమాధానం చెప్పలేక యధాలాపంగా బయటకు చూస్తూ కూర్చుంది. విశ్వతేజ గురించి మంజీర్‌తో చెప్పాలా? వద్దా? అని మనసులో అనుకుంటూ ఆలోచిస్తోంది.

అంతవరకు ఆకాశంలో వున్న మబ్బులు కరిగి సన్నటి వర్షపు తుంపర మొదలైంది. ఆ తుంపర కారు ఫ్రంట్ గ్లాసుమీద పడి అప్పటికప్పుడే ఆ గ్లాసంతా మసకమసగ్గా అయింది. వెంటనే వైఫర్ ఆన్‌చేశాడు మంజీర్. అది చూసి మిథున తన ముంగురుల్ని వెనక్కి నెట్టుకుంటూ "ఇక్కడ కూడా వర్షాలు పడుతున్నట్లుందిగా" అంది.

"ఇక్కడ మామూలు వర్షాలే మేడమ్! మా ఊరిలో చుట్టుపక్కల ఊర్లలో రాళ్లవర్షం పడిందట" అన్నాడు మంజీర్.

అలాంటి వర్షాన్ని ఎప్పుడూ చూడని మిథున ఆశ్చర్యపోతూ "రాళ్ల వర్షమా!! అంటే? అదెలా పడుతుంది?" అని అడిగింది.

''ఆకాశంలోంచి ఐస్‌గడ్డలు పెద్దపెద్ద రాళ్లలాగా కిందపడ్డాయట... నేను కూడా ఆ వర్షాన్ని ఎప్పుడూ చూడలేదు. పొలాల్లో వున్న రైతులకి, రైతుకూలీలకి ఆ వర్షం వల్ల దెబ్బలు తగిలాయట,

తలలు పగిలాయట. హాస్పిటల్‌కెళ్తే అందరికి వరసగా సిటీస్కాన్‌లు తీయించారట డాక్టర్.... అమ్మ నాకు కాల్ చేసి చెప్పింది” అన్నాడు.

మిథున వెంటనే “అయ్యో! అలాగా! మీ అమ్మగారు ఎలా వున్నారు మంజీర్?” అడిగింది.

“ఆమె ఆ సమయంలో ఎటూ వెళ్లలేదట. సేఫ్!” అన్నాడు.

“పోన్లే మంజీర్! నీకు కొంత టెన్షన్ తగ్గింది” అంది. మంజీర్ మాట్లాడలేదు. మిథున అదేం గమనించకుండా కారు ఫ్రంట్ గ్లాసులోంచి ఏనుగుల గుంపులా కదిలి వెళ్తున్న మేఘాలను చూస్తూ విశ్వతేజను గుర్తు చేసుకుంది.

మంజీర్ తల తిప్పి వెనక్కి చూడకుండానే “మీరేంటి మేడమ్ అదోలా వున్నారు? దేని గురించైనా ఆలోచిస్తున్నారా?” అని మళ్లీ అడిగాడు.

ఆమె బలవంతంగా ఓ నవ్వు నవ్వి “నేను ఆలోచిస్తున్నానని నీకెలా తెలుసు మంజీర్! ఇది రెండోసారి నువ్వు అడగడం” అంది.

అతను డ్రైవ్ చేస్తూనే నేరుగా రోడ్డు వైపు చూస్తూ చాలా నెమ్మదిగా “మీలో నాకు అంతా తెలియకపోవచ్చు. కొంత తెలుసు మేడమ్! అందులో భాగంగానే మీ హావభావాల్లో ఏమాత్రం మార్పు వచ్చినా నాకు తెలిసిపోతూ వుంటుంది” అన్నాడు.

ఆమె మళ్ళీ నవ్వి “నామీద రీసెర్చ్ చేస్తుంటావా ఎప్పుడు?” అంది.

“ఇంకా నయం. నన్నే చూస్తుంటావా అని అనలేదు” అని అనబోయి నాలిక కరచుకొని “అదికాదు మేడమ్! మీ బిజినెస్ వ్యవహారాలు, వాటి తాలూకు వత్తిడిలు ఎన్ని వున్నా కారులో కూర్చున్నాక అవన్నీ వదిలేసి నాతో సరదాగా మాట్లాడుతూ గడిపేవాళ్లు కదా! ఇప్పుడేంటి ఇంత మౌనంగా వున్నారు అన్నదే చిన్న డౌట్! ఏమైనా వుంటే నాతో షేర్ చేసుకోండి! పర్వాలేదు. నన్ను డ్రైవర్‌గానే కాదు సలహాదారునిగా కూడా ఉపయోగించుకోవచ్చు. ఇబ్బందేం లేదు” అన్నాడు సరదాగా.

ఈసారి ఎలాంటి బలవంతం లేకుండా హాయిగా నవ్వింది మిథున.

మంజీర్‌తో ఏమైనా మాట్లాడగలదు కాని విశ్వతేజ గురించి మాట్లాడాలంటేనే మాట్లాడలేదు. అందుకే అతని గురించి వదిలేసి ఫ్లైట్‌లో పరిచయమైన అమ్మాయి గురించి చెప్పింది. ఆ అమ్మాయి చేస్తున్న పనేంటో వివరంగా చెప్పింది.

“సూపర్బ్ మేడమ్! ఇలాంటి పని చేసేవాళ్లు ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా అవసరం. ఎందుకంటే మంచి పుస్తకాలు చదవడం, మంచి వాళ్లతో స్నేహం చెయ్యడం అనేది చిన్నపిల్లల్లో కుదిరేపని కాదు. వాళ్లకు చక్కగా కథలు చెప్పేవాళ్లు కావాలి. కథలంటే చందమామ కథలు మాత్రమే కాదు వయసుని బట్టి వారికి కావలసిన భాష విజ్ఞానం కూడా అందులో వుండేలా కథలను తయారు చేసుకొని చెప్పేవాళ్లు కావాలి....”

“ఆ అమ్మాయి అలాగే చెబుతుందట మంజీర్! ‘స్టోరీ ఆర్ట్స్ ఇండియా’ పేరుతో కొన్ని ప్రదేశాల్లో పిల్లల్ని సమీకరించి కథలు చెబుతున్నానని చెప్పింది. ఒక ఐదారు పాఠశాలలకు స్టోరీ టెల్లర్‌గా కూడా పని చేస్తుందట. పాఠశాలలో ఉపాధ్యాయుల కోరిక మేరకు హరికథల రూపంలోనే కాక చిన్నపిల్లల మెదడులో పూర్తిస్థాయి ఊహాచిత్రం వచ్చే విధంగా వివరించి చెబుతుందట”

“చెప్పాలి మేడమ్! నిజానికి కథకు వున్న శక్తి ఎలాంటిదో చాలామంది తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియదు. నన్నడిగితే కథలు చెప్పే తరగతి ప్రతి పాఠశాలలో వుంటే మంచిది. చానల్ల పుణ్యమా అని పిల్లల వినోదానికి కొదవలేకపోయినా మితిమీరి టీ.వి. చూడడం వల్ల పిల్లల్లో ఆలోచన, విశ్లేషణా సామర్థ్యం తగ్గిపోతుంది. కథలు వినే క్రమంలో రకరకాల దృశ్యాలను ఊహించుకుంటూ పిల్లల్లో జ్ఞాపకశక్తి పెరిగే అవకాశం కూడా వుంది. చిన్న వయసు నుండి కథలు వినడం వల్ల మానవ సంబంధాలు, నైతిక విలువల్లోని గొప్పతనం తెలుస్తుంది.

ముఖ్యంగా సమస్యకు పరిష్కారం ఎలా ఆలోచించాలో కూడా తెలుస్తుంది. అలా తెలియకనే ఈ రోజుల్లో కొంతమంది జీవితాలు ఎలా తయారవుతున్నాయో మనం చూస్తున్నాం. ముఖ్యంగా నా లైఫ్" అన్నాడు మంజీర్.

"నీ లైఫ్‌కేమైంది. బాగానే వున్నావుగా"

"అనుకోగానే వున్నట్లా! అది మన అంతరాత్మకు తెలియదా?"

"అలా అనుకుంటే ఎలా? టీచర్ పాఠం చెప్పి పరీక్ష పెడితే, జీవితం పరీక్ష పెట్టి పాఠం నేర్పుతుందనడం వినలేదా?"

"వినడానికి ఫేస్ చెయ్యటానికి తేడా లేదా?" అన్నాడు. వాతావరణం గంభీరంగా మారింది. అతని జీవన విధానం ఆమెకు తెలియకపోవడం వల్ల ఏం మాట్లాడలేకపోయింది. అంత లోతులకెళ్ళి మాట్లాడే సందర్భం కూడా కాదు అది. కానీ ఎప్పుడైనా ఒక మాట చెప్పలేని విషయాన్ని ఒక పదం చెబుతుంది. పదం చెప్పలేనిది చూపు చెబుతుంది. చూపు చెప్పలేనిది శరీర కదలికలు చెబుతాయి. ఇప్పుడు మంజీర్ ఎంత బాధ పడుతున్నాడో అతని భుజాలను వెనక నుండి చూస్తుంటే అర్థమవుతుంది.

ఆమె కాస్త ముందుకు వంగి "ప్లీజ్! మంజీర్! నువ్వేదో బాధ పడుతున్నట్లున్నావు. బాధ పడకు" అంది.

మంజీర్ మాట్లాడలేదు. కారు ఫ్రంట్ గ్లాసు మీద పడుతున్న వర్షపు చుక్కల్ని వైఫర్ తొలగించగలదేమో కానీ, మంజీర్ మనసుపై పడుతున్న భావావేశపు అలజడిని తొలగించే వైఫర్లు ఎక్కడున్నాయి? వాటినెవరు సృష్టించగలరు? అసలు దేన్నైనా టెస్ట్ చేసే లాబ్‌లు వున్నాయేమో కాని మనిషి మనసును టెస్ట్ చేసే లాబ్‌లు ఎక్కడున్నాయి?

మిథున సీటు వెనక్కి వాలి కూర్చుంది. "మంజీర్! నా అనుభవంతో నేనో సత్యాన్ని చెప్పగలను. ఒక అమ్మాయి ఎప్పుడైనా బాధపడితే అది ఆమె అమాయకత్వం. అదే ఒక అబ్బాయి బాధ పడుతున్నాడూ అంటే అది అతని మంచితనం... సో అబ్బాయి కాని,

అమ్మాయి కాని పరిస్థితుల్ని, సమాజాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్లాలంటే చాలా కష్టం. అందుకే అంటారు జీవితం గురించి పరిస్థితులు, సమాజం ఏం చెప్పినా నమ్మకూడదని...” అంది.

ఆమె అలా మాట్లాడుతూ వుండగానే ఇల్లు వచ్చింది. అది మామూలు ఇల్లు కాదు. చిన్నసైజు ఇంద్రభవనం. కారు ఆగగానే కారు దిగి లోపలకి వెళ్లింది మిథున. ఆమె వెళ్లిన కొద్దిసేపటికే మంజీర్ కూడా కారును పార్కు చేసి లోపలకెళ్లాడు. అప్పటికే మిథున ఇంట్లో పని చేస్తున్న జస్సీ అనే అమ్మాయి మిథున అవసరాలను చూసే కార్యక్రమంలో హడావుడిగా వుంది.

మంజీర్ కారు తాళాలను టీపాయ్ మీద పెట్టి, మిథునతో చెప్పి ఇంటికెళ్లిపోయాడు.

మిథున స్నానం చేసి బట్టలు మార్చుకొని జస్సీ పెట్టిన టిఫిన్ తిని రిలాక్స్‌డ్‌గా పడుకొంది. చూడాల్సిన ఫైల్స్ కొన్ని వున్నాయి. వాటిని ముట్టుకోలేదు. వాటి పని ఇంకో గంట తర్వాత అన్నట్లు వాయిదా వేసుకుంది. ఒక అర్ధగంట నిద్రపోవాలని కళ్లు మూసుకుంది. నిద్ర రాలేదు. లేచి పుస్తకం పట్టుకుంది. అది కూడా చదవాలనిపించలేదు... ఆమెకు వృధాగా సమయాన్ని గడపడం, శూన్యంలోకి చూస్తూ కూర్చోవడం నచ్చదు.

ఎప్పుడూ ఏదో ఒకటి చెయ్యాలి. చేస్తూనే వుండాలి. ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియదు కాబట్టి ప్రతిక్షణాన్ని శ్రమించడానికే వాడుకోవాలనుకుంటుంది. ఆ శ్రమలోనే శక్తిని వెతుక్కుంటుంది. పనిలోనే కోట్ల విలువైన ఆనందాన్ని అందుకుంటుంది. కానీ ఇప్పుడామెకు ఏ పనీ చెయ్యాలనిపించటం లేదు. కనీసం నిద్ర కూడా!! అలాంటప్పుడు ఎలా రీచార్జ్ కావాలి...? ఇదంతా విశ్వతేజ ఢిల్లీ ఎయిర్‌పోర్టులో మాట్లాడిన మాటల ప్రభావమే. విశ్వతేజ అలా మాట్లాడతాడని ఆమె వూహించలేదు. ఎప్పుడైనా ఆమె దగ్గర ఫ్రీగా మూవ్ అయ్యేవాడే కానీ ఆమెపట్ల అలాంటి అభిప్రాయంతో వున్నాడన్నది ఆమెకు తెలియదు. అందుకే వినగానే ఆశ్చర్యపోయింది.

విశ్వతేజ ఆమెకు కొత్తకాదు. చాలా చోట్ల కలుసుకుంటూనే వుంటారు. అతను ఈవెంట్ మేనేజర్ కాబట్టి అతను కండక్ట్ చేసే ప్రోగ్రామ్స్‌కి ఆమెను చాలా గౌరవంగా ఆత్మీయంగా ఇన్‌వైట్ చేస్తుంటాడు. ఆమె బిజినెస్‌కి రిలేటెడ్‌గా వున్నవైతే ఆమె తప్పకుండా వెళ్తుంది. లేకుంటే 'నో' చెబుతుంది. అతను ఎక్కువగా బిజినెస్ సెషన్స్ చూస్తుంటాడు. ఏదైనా కొత్త ప్రొడక్ట్‌ను మార్కెటింగ్ చేసే కార్యక్రమంలో లాంచింగ్ ప్రోగ్రాం అని, ప్రమోషన్ ప్రోగ్రాం అని, ఫీడ్‌బ్యాక్ ప్రోగ్రాం అని ఇలా పెద్ద పెద్ద ప్రోగ్రామ్సే చేస్తుంటాడు. అతనంటే ఆమెకు మంచి అభిప్రాయమే వుంది.

ఢిల్లీలో ఆమె వెళ్లిన కాన్ఫరెన్స్‌కి అతను కూడా వచ్చాడు. కాన్ఫరెన్స్ జరుగుతున్నంతసేపు ఆమె పక్కనే వున్నాడు.

ఆ తర్వాత ఎయిర్‌పోర్టులో నోరు విప్పాడు.

"మిథునా! మనిద్దరం పెళ్లి చేసుకుందాం!" అని

బిత్తరపోయింది మిథున. ఎయిర్‌పోర్టు మొత్తం ఎ.సి. అయినా శరీరమంతా వేడెక్కిపోయింది. ఊపిరాడనట్లు ఉక్కిరిబిక్కిరైంది. 'నన్ను ఇతను పెళ్లిచేసుకుంటాడా?' ఆమెలో ఆమే సన్నగా గొణుక్కుంది.

"ఎస్" అన్నాడు విశ్వతేజ ఆమె ముఖంలో కదిలిపోతున్న భావాలను చదివి.

"మీకు నా గురించి తెలిసే ఇలా అడుగుతున్నారా?" అంది.

ఆమె గురించి అతనికేం తెలియదు కాబట్టి "నో" అన్నాడు వెంటనే.

"విశ్వతేజ గారూ! ఏదైనా ఒక పని చెయ్యాలనుకున్నప్పుడు పూర్వాపరాలు, దాని మూలాలు తెలుసుకోవద్దా? అసలు నా గురించి మీకు ఏం తెలుసని ఈ నిర్ణయానికి వచ్చారు?"

"పెళ్లి చేసుకోవటానికి ఇన్ని తెలుసుకోవాలని నేను అనుకోవటం లేదు. పెళ్లయ్యాక ఇద్దరి మధ్యన ప్రేమ, అవగాహన, నమ్మకం, ఒకరిని ఒకరు అర్థం చేసుకునే శక్తి వుంటే చాలనుకుంటున్నాను" అన్నాడు.

"అవన్నీ మన ఇద్దరి మధ్యన వుంటాయని మీరెలా అనుకుంటున్నారు"

"మీరంటే నాకున్న ఇష్టం వల్ల, ప్రేమ వల్ల, నమ్మకం వల్ల.... ఇంతకన్నా నా దగ్గర ఇంకేం మాటలు లేవు"

"ఇష్టం, ప్రేమ, నమ్మకం. ఇవి మూడు కలిసి ఇద్దరి వ్యక్తుల మధ్యన ఎంత కాలం వుంటాయో మీరు నాకు గ్యారంటీ ఇవ్వగలరా?"

"గ్యారంటీయా! అవేమైనా మనం మన చేతులతో మానిఫ్యాక్చర్ చేసుకున్న వస్తువులా? ఇవి ఇన్ని రోజులే పని చేస్తాయ్! తర్వాత పని చెయ్యవు అనుకోటానికి...."

"వస్తువులకి తప్పకుండా మినిమమ్ గ్యారంటీ ఇవ్వగలం. కానీ మీరనుకుంటున్నారే ప్రేమ, ఇష్టం, నమ్మకం. వీటికి మాత్రం ఇవ్వలేం"

"మీరేదో నిరాశలో కూరుకుపోయి మాట్లాడుతున్నట్లున్నారు. ఇది నేను మాట్లాడవలసిన సమయం కాదేమో! తర్వాత మాట్లాడనా?"

"ఈ టాపిక్ అయితే వద్దు"

అతను షాకింగ్‌గా చూసి "ఎందుకు వద్దు?" అని అడిగాడు.

"వద్దంటున్నాను కదా! వద్దు..."

"నేను మాట్లాడతానన్నప్పుడు వద్దనడానికి మీరెవరండీ?"

"మిధునను"

"మిధునా! ప్లీజ్! నన్ను హర్ట్ చెయ్యకు"

"ఒకరిని హర్ట్ చేసేంత టైం నాకు లేదని మీకు తెలుసు"

అతను కోపంగా చూశాడు. వెంటనే కుడిచేయి పిడికిలి బిగించి ఒక్కో వేలును లెక్కపెట్టుకుంటూ పిడికిలి వదిలాడు. కోపాన్ని కంట్రోల్ చేసుకున్నాడు. మిధున ముఖంలోకి పరిశీలనగా చూస్తూ

"టైం లేదనడానికి నేను నీ బిజినెస్ గురించి మాట్లాడడం లేదు. నా బిజినెస్ గురించి కూడా మాట్లాడటం లేదు. కేవలం మన ఇద్దరి పర్సనల్ లైఫ్ గురించి మాట్లాడుతున్నాను. నువ్వు దీన్ని బిజినెస్ చేసి ఆలోచిస్తున్నావ్"

"నేను బిజినెస్ చేసి ఆలోచిస్తున్నానా?"

"అవును. జీవితం గురించి మాట్లాడుతున్నప్పుడు హృదయంతో ఆలోచించి మాట్లాడాలి. మాట్లాడే ప్రతి మాటలో హృదయం కన్పించాలి. నీ మాటల్లో అది లేదు"

"హృదయం గురించి ఆలోచించే టైం నాకు లేదు. అంత చిన్నపిల్లను కూడా కాదు"

"పెద్దవాళ్లకి హృదయం వుండదా? అది స్పందించదా? ఎప్పుడు చూసినా టైం బౌండ్ లక్ష్యాలేనా? వ్యాపారాత్మక ఆలోచనలేనా? ఇంత టైంలో ఇంతే మాట్లాడాలి... ఇంతే నవ్వాలి... ఇంతే ఆలోచించాలి... ఇంతే ఏడవాలి. ఇంతకన్నా ఎక్కువగా ఏడవకూడదు. ఇంతేనా? ఇక ఎప్పటికీ ఇంతేనా?" అన్నాడు అసహనంగా.

ఆమె మాట్లాడలేదు.

"చూడు మిథునా! టైం బౌండ్ లక్ష్యాలు నాకూ వున్నాయి. టైం మేనేజ్‌మెంట్ నాకూ తెలుసు. ఇవి లేకుంటే ఎవరూ ఎదగలేరు. నువ్వు కూడా ఇవి వుండబట్టే ఎదిగావు. ఇంకా ఎదుగుతావు. ఆ తర్వాత ఏంటి? దీనికి నీ దగ్గర సమాధానం లేదు. ఎందుకంటే మనిషిని, మనిషి హృదయాన్ని అర్థం చేసుకోవడం నీకు రాదు"

"నాకు రాదని నేను ఒప్పుకుంటున్నాను. నన్నిక వదిలేస్తారా?"

"వదిలెయ్యటానికా నేను మీ గురించి ఇంతగా ఆలోచించేది? అయినా నా మనసులోంచి ఏది తీసెయ్యాలో, ఏది సేకరించాలో నాకు తెలియదా?"

ఆమె సూటిగా అతనివైపు చూడబోయి పక్కకు చూస్తూ కూర్చుంది.

"నాకు తెలుసు మిథునా! నా మాటలు, నా సమక్షం నీకెంత చిరాకు కలిగిస్తున్నాయో. కానీ అది ఎంత వరకు సరియైనదో కాస్త ఆలోచించు"

"నాకు అవసరం లేనివాటి గురించి నేను ఏమాత్రం ఆలోచించను" అంది.

"నీకు ఈ క్షణం ఇలా అన్పిస్తే అన్పించవచ్చు. తర్వాత నువ్వు పశ్చాత్తాపపడే సమయం తప్పకుండా వస్తుంది. ఎందుకంటే జీవితంలో వాళ్లుంటే వీళ్లుండకపోవడం, వీళ్లుంటే వాళ్లుండకపోవడం ఎంత వాస్తవమో అడిగినప్పుడు సమాధానం చెప్పకపోతే సమాధానం వున్నప్పుడు అడిగేవాళ్లుండకపోవడం కూడా అంతే వాస్తవం. ఇది నువ్వు గ్రహించాలి" అంటూ అతను అక్కడి నుండి అసంతృప్తిగా లేచి తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు.

ఆ తర్వాత ఆమె ఒక్కతే ఢిల్లీ ఎయిర్‌పోర్టులో మిగిలిపోవడం... వెంటనే ఫ్లైట్ రావడం... ఆ ఫ్లైట్ ఎక్కి హైదరాబాదు రావడం... అంతా కొన్ని గంటల్లో జరిగిపోయింది.

ఇప్పుడు ఏం చేయాలన్నా ఆమె మనసు శక్తి హీనంగా వుంది. విశ్వతేజ గురించి ఎవరితో అంటే వాళ్లతో చెప్పుకోలేకపోయినా జాహ్నవితో మాత్రం తప్పకుండా చెప్పుకోవాలనుకుంది. లేకుంటే మనసు బద్దలవుతుందని ఆమె భయం. అందుకే ఇంటికెళ్లిన మంజీర్‌ని రమ్మని కాల్ చెయ్యాలని మొబైల్ చేతిలోకి తీసుకొని అతని నెంబర్ నొక్కింది. రింగవుతుంటే చెవి దగ్గర పెట్టుకుంది. లిఫ్ట్ చెయ్యగానే అవతలవాళ్లు 'హలో' అనకముందే "మంజీర్! నువ్వు అర్జంట్‌గా రావాలి" అంది మిథున.

అవతలి వైపున మంజీర్ లేడు. అతనికి బదులుగా "ఆయన లేడు" అంటూ కంచులా మోగింది స్త్రీ గొంతు.

"ఎక్కడికెళ్లాడు? ఎప్పుడొస్తాడు?"

"నాకేమైనా చెప్పివెళ్లాడా? నన్ను కొట్టి వెళ్లాడు"

"నిన్ను కొట్టి వెళ్లాడా? నీ గొంతు ఎక్కడో విన్నట్లుందే. నువ్వు, నువ్వు... నీపేరు తెలుసుకోవచ్చా?"

"నా గొంతు విన్న ప్రతి.... ఎందుకులే నాకొచ్చే కోపంలో నేనేం మాట్లాడతానో నాకే తెలియడం లేదు. నా పేరుతో మీకేం పని? ఇంతకీ నువ్వెవరో చెప్పనేలేదు"

"మంజీర్ నా కారుకే డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు" అంది మిథున. అంతకన్నా ఇంకేం చెప్పాలనిపించలేదామెకు.

"అలాగా. వస్తే చెబుతాలే..." అంది నిర్లక్ష్యంగా.

ఆమె సమాధానం చెప్పే విధానం మిథునకు నచ్చలేదు. మాట్లాడేది మంజీర్ భార్యనా, లేక ఇంట్లో ఇంకెవరైనానా? కొట్టి వెళ్లాడంటుందేం? మంజీర్‌ని చూస్తుంటే ఆడవాళ్లను కొట్టేవాడిలా లేడే! ఫోన్ పెట్టేసి గదిలోంచి హాల్లోకి... హాల్లోంచి బాల్కనీలోకి.... బాల్కనీలోంచి లాన్‌లోకి నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లింది. అక్కడ అందంగా మొలిచిన పచ్చికపై మెల్లగా నడుస్తూ ఆలోచిస్తూ చాలాసేపు గడిపింది.

మళ్లీ కాల్ చేసింది మంజీర్‌కి... "ఆయన లేడండీ! నన్ను కొట్టి వెళ్లి గంటయింది. ఇది రెండోసారి మీకు ఈ విషయం చెప్పటం. ఈసారి కాల్ చేస్తే నేను లిఫ్ట్ చెయ్యను. నాకు పనులున్నాయి. చచ్చిపోతున్నా రాత్రుళ్లు నిద్ర వుండదు. పగలు నిద్ర వుండదు" అంటూ కాల్ కట్ చేసింది.

ఈ గొంతు ఎక్కడో విన్నట్లు వుందే అని అనుకుంటూ మొబైల్‌ని అలాగే పట్టుకొని ఆలోచించింది మిథున. ఎంతకీ గుర్తు రావడం లేదు. ఆ గొంతు ఎవరిదో!!

జాహ్నవి దగ్గరకి వెళ్లాలంటే మంజీర్ వస్తేనే తప్ప మిథునకు వేరే మార్గం లేదు. అంత అర్జంట్ అనుకుంటే ఏజన్సీకి ఫోన్ చేసి డ్రైవర్‌ని పిలిపించుకోవచ్చు. అలాగే చెయ్యాలి అని అనుకుంటూ కారు వైపు నడిచింది.

కారులో స్టీరింగ్ మీద తల పెట్టుకొని కూర్చుని వున్న మంజీర్‌ని చూసి ఆశ్చర్యంగా.

"మంజీర్" అంది.

అతను మాట్లాడకుండా కారు దిగి నిలబడ్డాడు.

"నువ్వు ఇంటికి వెళ్లలేదా?"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Oka+Chinna+Abaddam**

* * *